
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 12 । జూలై । 2024





## కనకదుర్గకు ఆషాఢ సారె

మంగళగిరి: యర్రబాలేనికి చెందిన మహిళలు బుధవారం విజయవాడ కనకదుర్గకు ఆషాఢం సారె సమర్పించారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసి రాజధానిని అభివృద్ధి చేయాలని కోరారు.



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 203 క్యూసెక్కులు విడుదల చేశారు.



## తిరుపతమ్మకు సారె సమర్పణ

పెనుగంచిప్రోలు : ఆషాఢమాసం సందర్భంగా తిరుపతమ్మకు గురువారం పెనుగంచిప్రోలులోని భక్త సేవా సేవానంఘం ఆధ్వర్యంలో మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు.

## న్యూస్‌రీల్

### ప్రజలకు మేలు జరిగేలా పని చేస్తా !

**జేసీ బి.సుబ్బారావు**



**బాపట్ల:** అందరి సహకారంతో ప్రజలకు మేలు జరిగేలా పని చేస్తానని నూతన జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా కలెక్టర్ జె. వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అత్యధికంగా రెవెన్యూ సమస్యల పైనే అర్జీలు వస్తున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, జిల్లా అభివృద్ధికి కష్టపడి పని చేస్తానని చెప్పారు. పలు శాఖల్లో వివిధ హోదాల్లో పని చేసిన అనుభవం ఉందని తెలిపారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌లో ఎంపికైనప్పటికీ జిల్లా సంయుక్త కలెక్టర్‌గా తొలిసారి బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. అనంతరం బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు జి. రవీందర్, జి. సూర్యనారాయణరెడ్డి, హేలా షారోన్, కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, పలువురు తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

### సెయింట్ ఆన్స్ అధ్యాపకుడికి జాతీయ అవార్డు



**వేటపాలెం:** తమ అధ్యాపకుడు గర్నిపూడి దిలీప్‌కుమార్ జాతీయ స్థాయి అవార్డు సాధించినట్లు స్థానిక సెయింట్ ఆన్స్ ఫార్మసీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ ఎడ్యుకేషన్, సైంటిఫిక్ రీసెర్చ్‌పై కృషి చేసినందుకు సోలాపూర్‌కు చెందిన ఆవిష్కార్ ఫౌండేషన్ ఇటీవల నేషనల్ లెవల్ బెస్ట్ యంగ్ అధ్యాపక్ ఆఫ్ ది ఇయర్ అవార్డును దిలీప్‌కుమార్‌కు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన రాసిన టెక్స్ట్ బుక్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫార్మసీ-1 పాఠ్య గ్రంథాన్ని మహారాష్ట్రకు చెందిన ప్రీతమ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రచురించిందని ప్రిన్సిపాల్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడిని అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

### డయేరియాతో మహిళ మృతి



తమ్మిశెట్టి తిరుపతమ్మ

**పిడుగురాళ్ల:** డయేరియాతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన తమ్మిశెట్టి తిరుపతమ్మ(67) బట్టీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత ఆరు రోజుల నుంచి వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక మారుతీనగర్‌లోని వైద్యశాలలో చికిత్స పొందుతోంది. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

### 27,246 బస్తాల మిర్చి విక్రయం



**కొరిటిపాడు (గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 26,349 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,246 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 10,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,800 నుంచి రూ. 18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,946 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# తల్లుల ఆశలపై నీళ్లు

- ఇంటిలో ఒక్కరికే తల్లికి వందనం నగదు
- మాటతప్పిన కూటమి సర్కార్
- ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది ఉన్నా ఇస్తామన్న బాబు
- గద్దెనెక్కాక బోడి మల్లన్న చందంగా వ్యవహారం
- జిల్లాలో 1.92 లక్షల మంది విద్యార్థుల ఎదురుచూపు
- ఫీజులు, ఖర్చుల కోసం అప్పులు చేస్తున్న తల్లిదండ్రులు
- గతంలో జూన్‌లోనే అమ్మఒడి నగదు జమ
- ప్రస్తుత ఎప్పుడు వేస్తారో తెలియక తల్లిదండ్రుల ఆందోళన
- కూటమి ప్రభుత్వం వంచనపై మండిపాటు

**బాపట్ల టౌన్:** చంద్రబాబు మరోమారు తన నైజాన్ని చాటుకున్నారు. ఇచ్చిన మాట తప్పారు. తానిచ్చిన హామీని తుంగలో తొక్కారు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పారు. ఎన్నికల ప్రచార సభల్లో గొంతెత్తి అరిచి చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇంటికి ఒక్కరికి మాత్రమే ఇస్తామని మాటమార్చారు. ఇప్పుడు చంద్రబాబు మాట మార్చడంపై విద్యార్థుల తల్లులు మండిపడుతున్నారు. కూటమి సర్కార్ వంచనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏరు దాటాక బోడి మల్లన్న చందంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

**పలు కారణాలతో కోతకు సిద్ధం**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1417, ప్రైవేట్ పాఠశాలలు 413 ఉన్నాయి. వీటిల్లో గతేడాది గణంకాల ప్రకారం 1.92 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం హామీ మేరకు జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరగనుంది. అయితే, తాజాగా ప్రభుత్వం ఇచ్చిన మాటతప్పి కేవలం ఇంటికి ఒక్కరికే తల్లికి వందనం ఇచ్చేందుకు సిద్ధమైంది. అదికూడా గత ప్రభుత్వం ఇచ్చిన వారిలోనూ పలురకాల కారణాలతో కోత పెట్టేందుకు ప్లాన్ వేస్తోంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పథకం వర్తింపచేసేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు ప్రాతిపదికన పథకాన్ని అమలు చేయాలని యోచిస్తోంది. ఇదే జరిగితే 'తల్లికి వందనం' లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. దీంతో తల్లులు మరింత ఆందోళన చెందుతున్నారు. పోనీ ఒక్కరికి అమలు చేసినా అదికూడా ఎప్పుడిస్తారో స్పష్టత లేకుండా పోయింది.

**వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తంఛన్‌గా చేతిలో డబ్బులు**

చదువుకు పేదరికం అడ్డురాకూడదు...ప్రతి తల్లీ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్న లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం 'అమ్మఒడి' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పిల్లలను బడికి పంపే ప్రతి తల్లి ఖాతాకు నేరుగా రూ.15 వేలు విద్యా సంవత్సరం ఆరంభంలోనే జమ చేసింది. పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యాకానుకలను సైతం అందించేది. దీంతో జిల్లాలో లక్షలాది మంది విద్యార్థులు, వేలాది మంది తల్లులు లబ్ధి పొందారు. దీంతోపాటు నాడు-నేడు కింద పాఠశాలల్ని అభివృద్ధి చేసి తద్వారా విద్యాభివృద్ధికి పాటుపడ్డారు.

**గత ప్రభుత్వంలో జమచేసిన నిధులు ఇలా..**

| విద్యా సంవత్సరం | లబ్ధిదారులు | మొత్తం రూ. కోట్లలో |
|---|---|---|
| 2019-20 | 1,14,550 | రూ.171.82 |
| 2020-21 | 1,16,019 | రూ.162.42 |
| 2021-22 | 1,19,953 | రూ. 155.94 |
| 2022-23 | 1,17,827 | రూ.176.75 |

### సీఎం సార్.. మాట నిలబెట్టుకోవాలి



నాపేరు శిరీష. నాది పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ. నాకు ఇద్దరు పిల్లలు. పట్టణంలోనే చదివించుకుంటున్నాను. నేను అక్కడ సంపన్నుల ఇళ్లల్లో పనికి వెళ్తుంటాను. నా భర్త తాపీ పని చేస్తుంటాడు. మా ఇద్దరు పిల్లలు ఒకరు 3వ తరగతి, రెండోవాడు ఒకటో తరగతి చదువుతున్నాడు. నాకు చిన్నతనం నుంచి మంచిగా చదువుకోవాలనే కోరిక ఉండేది. మా అమ్మానాన్నల ఆర్థిక పరిస్థితుల కారణంగా నా చదువు మధ్యలోనే ఆపేశాను. మేము పడుతున్న బాధలు...కష్టాలు మా బిడ్డలకు రాకూడదని మేము ఎంతకష్టమైనా పడి బిడ్డల్ని చదివించుకుంటున్నాం. ఎన్నికలప్పుడు సీఎం సార్ ఇంట్లో ఎంత మంది ఉన్నా 'తల్లికి వందనం ' ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఒక్కరికేనని చెబుతున్నారు. ఇదిసరికాదు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.




స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ. 15వేలు ఇస్తామంటూ కూటమి ఇచ్చిన రెండో హామీ (వృత్తంలో)

### తల్లికి వందనం అందరికీ ఇవ్వాలి



నా భర్త పట్టణంలో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంటారు. నాకు ఇద్దరు పిల్లలు. మేము పడుతున్న కష్టాలు నా బిడ్డలకు రాకూడదనే ఆలోచనతో ఇద్దరినీ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాం. వీరికి స్కూల్‌ఫీజు, బుక్స్, మెటీరియల్స్, యూనిఫామ్, వ్యాన్‌ఫీజు, మొత్తంగా రూ. 60 వేలు వరకు ఖర్చు అవుతుంది. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మా ఇంట్లో ఇద్దరికి కలిపి ఏడాదికి రూ. 30 వేలు వస్తాయని ఆశపడ్డాం. ఇప్పుడు ఒక్కరికే ఇస్తామంటే ఎలా?

– ఎం. జ్యోతి, డ్రైవర్స్ కాలనీ

### మా బాధలు అర్థం చేసుకోవాలి



మా ఆయన డప్పుల కొట్టేందుకు, అవిలేనప్పుడు తాపీ పనులకు పోతుంటాడు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేము కాయకష్టం చేసి వారినైనా మంచిగా చదివించుకోవాలని పోరాడుతున్నాం. పిల్లలకు ప్రయోజకులను చేసుకోవాలనే ఆశ ఉన్నప్పటికీ చేతిలో డబ్బులు లేని కారణంగా వారు అడిగిన వస్తువులు, పుస్తకాలు కూడా కొనిచ్చే పరిస్థితి లేదు. ఎన్నికల ముందు మాటిచ్చినట్లే ముఖ్యమంత్రి సారూ తల్లికి వందనం డబ్బులు కోత పెట్టకుండా ఇచ్చి ఆదుకోవాలి.

– జె. లలిత, కనకాద్రినగర్

### త్వరగా ఇస్తే ఉపయోగం



గత ప్రభుత్వంలో ఒక్కరికే రూ.15 వేలు ఇచ్చారు. నూతన ప్రభుత్వం ఎంత మంది ఉంటే అంతమందికి ఇస్తామని ప్రకటించింది. నాకు ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఇద్దరికీ కలిపి రూ.30 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నా. చెప్పిన మాట ప్రకారం నిబంధనలతో పని లేకుండా తల్లికి వందనం అమలు చేయాలి.

– షేక్ మున్నీ, సంతమాగులూరు మండలం

### డబ్బుల కోసం ఎదురు చూస్తున్నా



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. అమ్మకు వందనం పథకం ద్వారా ఒక్కో పిల్లవాడికి రూ.15 వేల చొప్పున మాకు రూ.30 వేలు రావాలి. దానికోసం ఎదురు చూస్తున్నాం. పెరిగిన నిత్యావసర ధరలతో పిల్లల చదువులు భారంగా మారాయి. కనీసం ప్రభుత్వం ద్వారా ఇస్తానన్న సొమ్ము ఇస్తే బాగుంటుంది.

– ఈదా తేజ, మేదరమెట్ల మండలం

### డబ్బులు ఎప్పుడు వస్తాయో ?



నా భర్త, నేను కూలీనాలి చేసుకొని జీవనం సాగిస్తున్నాం. నాకు ఇద్దరు పిల్లలు. గత ప్రభుత్వంలో నాకు ఒక పిల్లవాడికి అమ్మఒడి కింద రూ. 15 వేలు వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం మా ఇద్దరు పిల్లలకు రూ. 30 వేలు ఇస్తామని చెప్పింది. అవి ఎప్పుడు వస్తాయో అర్థం కావటం లేదు.

– గొర్రె నాగతులసి, ఆరికట్లవారిపాలెం

### సక్రమంగా అమలుచేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా తల్లికి వందనం పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ నగదు ఇవ్వాలి. ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేసి విద్యార్థుల చదువును ప్రోత్సహించాలి.

– జె.లక్ష్మి, కర్లపాలెం

# ఉచితం హామీ 'ఉఫ్'

- కూటమి పాలనలో మిన్నంటిన ఇసుక ధరలు
- ఎన్నికల ముందు ఇచ్చిన ఉచితం హామీ గాలికి
- గత ప్రభుత్వంలో టన్ను రూ. 475
- ప్రస్తుతం వేటపాలెంలో రవాణాతో కలిపి 18 టన్నులు రూ. 18,160
- బాపట్లలో రూ. 15,928
- మార్టూరులో రూ. 18,304
- మిగిలిన పాయింట్లలోనూ రూ.9 వేలకు పైగా ధర
- అది కూడా కూటమి నేతలకే ఇసుక
- వినియోగదారులకు ఇవ్వని వైనం



జువ్వలపాలెం (కొల్లూరు) స్టాక్ పాయింట్

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** ఉచితంగా ఇసుక సరఫరాపై కూటమి ప్రభుత్వం మాట మార్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి గండి కొట్టింది. ఉచితం మాటును దోపిడీకి తెరలేపింది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇసుకను అధిక రేట్లకు విక్రయించి వినియోగదారులపై మోయలేని భారం వేశారని చంద్రబాబు గోల చేశారు. తమకు అధికారం అప్పగిస్తే ఉచితంగా అందిస్తామని ఎన్నికల ముందు గొంతుచించుకొని అరిచారు. ఊరూరా మైకుల్లో ఊదరగొట్టారు. కుర్చీ ఎక్కగానే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని నమ్మబలికారు.

ఇదంతా నమ్మి ఓట్లేసిన జనం కూటమికి అధికారం కట్టబెట్టారు. ఇంకేముంది చంద్రబాబు తీరు ఏరుదాటాక బోడి మల్లన్న చందంగా తయారైంది. ఎన్నికల ముందు ఉచితంగా ఇసుక ఇస్తామన్న ఆయన ఇప్పుడు ఏకంగా అధిక రేట్లకు విక్రయిస్తూ వినియోగదారుల్ని వంచించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టన్ను రూ. 475 ఉండగా.. ఇప్పుడు కూటమి పాలకులు అంతకుమించి ధరలతో జనాన్ని దోచుకుంటున్నారు. పైగా అమ్మకాల్ని టీడీపీ నేతలకు ధారాదత్తం చేస్తున్నారు. వినియోగదారులకు అధిక రేట్లకు అమ్మి సొమ్ము చేసుకునే పనిలో వారంతా పడ్డారు. ఇప్పుడు జిల్లాలో ఇసుక అమ్మకాల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

**ధరల మోత**

కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామన్న హామీని తుంగలో తొక్కి అధిక ధరలకు విక్రయిస్తోంది. జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇష్టారాజ్యంగా రేట్లను పెట్టింది. బాపట్ల టన్ను రూ. 551కి అమ్ముతున్న ప్రభుత్వం, వేటపాలెంలో రూ. 675, మార్టూరులో రూ. 458 తీసుకుంటోంది. అనుమనమూరు, జువ్వలపాలెం, తిమ్మాయపాలెంలో రూ. 197 చొప్పున విక్రయిస్తున్నారు.

**రవాణా చార్జీలు మరింత భారం**

ఇసుక రవాణా చార్జీలు వినియోగదారులకు మరింత భారంగా మారాయి. ప్రస్తుతమున్న ధరల ప్రకారం బాపట్ల నియోజకవర్గ పరిధిలో 18 టన్నుల ట్రక్కుకు రవాణా చార్జితో కలిపి రూ. 15,928 చెల్లించాల్సి వస్తోంది. వేటపాలెం పాయింట్ నుంచి చీరాల ప్రాంతానికి ట్రక్కు రూ. 18,304, అద్దంకి, కొరిశపాడు స్టాక్ పాయింట్ల పరిధిలో రూ. 10 556, వేమూరు నియోజకవర్గం జువ్వలపాలెం పాయింట్ నుంచి రేపల్లె, తెనాలి ప్రాంతాలకు తరలింపునకు రూ. 9,556 తక్కువ లేకుండా చార్జ్ చేస్తున్నారు. మార్టూరు పాయింట్ నుంచి పర్చూరు నియోజకవర్గంలో చివరి ప్రాంతాలకు ఇసుక తరలింపునకు రూ. 18,304 చెల్లించాల్సి ఉంది. వినియోగారులకు ఇది మరింత భారంగా మారింది.



బాపట్ల పాయింట్

**ఉచితం పేరుతో వసూళ్ల పర్వం**

కూటమి ప్రభుత్వం అధిక ధరలకు అమ్మకానికి పెట్టడమే కాకుండా కేవలం ఇసుక వ్యాపారం చేసే టీడీపీ నేతలకే గుత్తమొత్తంగా కట్టబెడుతోంది. వారు 10 టన్నుల ట్రిప్పర్లు, 18 టన్నుల ట్రక్కులు పెట్టి స్టాక్ పాయింట్‌కు సమీపాన ఉన్న పట్టణం, లేదా మండలం కేంద్రాలకు ఇసుకను తరలించి అధికరేట్లకు వినియోగ దారులకు విక్రయిస్తున్నారు. నేరుగా దొరక్క పోవడంతో టీడీపీ నేతలు చెప్పిన ధర ఇచ్చి కొనాల్సి వస్తోంది.

**బాపట్ల జిల్లాలో ఇసుక ధరలు (రూపాయల్లో)**

| నియోజకవర్గం | టన్ను ఇసుక ధర | రవాణా చార్జీ | మొత్తం ఖర్చు |
|---|---|---|---|
| బాపట్ల | 551 | 445 | 996 |
| చీరాల | 675 | 445 | 1120 |
| అద్దంకి | 197 | 445 | 642 |
| మార్టూరు | 458 | 670 | 1128 |
| కొల్లూరు | 197 | 445 | 642 |

### వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇలా...

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం టన్ను ఇసుక రూ. 475కు ఇచ్చింది. అక్రమంగా ఇసుక తవ్వకుండా చర్యలు తీసుకుంది. పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వమే స్టాక్ పాయింట్లకు తరలించింది. అక్కడి నుంచి వినియోగదారులకు అందించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పేరుకు ఉచితంగా ఇసుక అంటూ టన్నుకు కొన్నిచోట్ల గత ప్రభుత్వం కంటే ఎక్కువగా రేటు పెట్టి అమ్ముతోంది. ఉచిత ఇసుక అంటూ ఓట్లు వేయించుకొని ఇప్పుడు దోపిడీకి పాల్పడటంపై ప్రజలు మండిపడుతున్నారు.

**జిల్లాలో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక నిల్వలు**

బాపట్ల జిల్లాలో కొల్లూరు మండలం జువ్వలపాలెం స్టాక్ పాయింట్‌లో 34,859 మెట్రిక్ టన్నులు, మార్టూరులో 2,333, అద్దంకి మండలం తిమ్మాయిపాలెం 5103, కొరిశపాడు మండలం అనుమనమూరు 11,830, వేటపాలెం మండలం వేటపాలెం వద్ద4053, బాపట్లలో 15,450 టన్నుల చొప్పున మొత్తం 73,628 టన్నులను గత ప్రభుత్వం స్టాక్ పాయింట్లలో సిద్ధం చేసి ఉంచింది. కూటమి అధికారంలోకి రాగానే కొందరు టీడీపీ నేతలు జువ్వలపాలెం, వేటపాలెం పాయింట్ల నుంచి కొంత మేర ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకున్నారు. మిగిలిన చోట్ల నాణ్యత కలిగింది కాకపోవడంతో డిమాండ్‌లేక కొంతమేర తరలించి మిగిలింది వదిలేశారు.

## తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు

**కలెక్టర్ జె.వెంకట మురళి**

**బాపట్ల:** మధ్య తరగతి ప్రజల సంక్షేమం దృష్ట్యా నిత్యావసర సరుకుల ధరల్ని రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఆయన గురువారం బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ కలిసి బాపట్ల రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన కిలో బియ్యం ధర రూ.49కు, కందిపప్పు ధర రూ.160 చొప్పున విక్రయించాలని సీఎం ఆదేశించడంతో మిల్లర్లు, ట్రేడర్స్ అంగీకరించారని చెప్పారు. బయట మార్కెట్లో బియ్యం ధర రూ.60, కందిపప్పు రూ.180 ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆధార్ కార్డ్ చూపి ఎవరైనా ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. మార్కెట్లో ధరలు స్థిరీకరణ అయ్యేవరకు ప్రత్యేక కౌంటర్లు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు. తక్కువ ధరలకే బియ్యం ఇస్తున్నామంటూ రైతులకు ధరలు తగ్గించి మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు మంచి ధరలు ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు పడవద్దని ఆయన సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంచడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటివి చేస్తే ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కల్పించేలా తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు అందిస్తున్నామని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కౌంటర్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి విలియమ్స్, బాపట్ల ఆర్డీవో జి. రవీందర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి. రత్న గుప్తా, కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావు. తాలూకా అధ్యక్షుడు కె. శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.



కందిపప్పును అందిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు

## భద్రత చర్యలతోనే క్వారీల్లో ప్రమాదాలకు అడ్డుకట్ట

**మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియో చక్రబర్తి**

**బల్లికురవ:** గ్రానైట్ క్వారీల్లో భద్రత చర్యలతో పాటు నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని హైదరాబాద్ మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ సుప్రియో చక్రబర్తి అన్నారు. బల్లికురవ ఈర్లకొండలో గురువారం అమూల్య, ఇంపీరియల్, ఎస్‌వీఆర్, గ్రానైట్ క్వారీలో రికార్డులు, క్వారీ హద్దులు, భద్రత చర్యల్ని ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం వీటీసీ (వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్) భవనంలో ఈర్లకొండ చుట్టూ ఉన్న క్వారీల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. పనులు చేసేటప్పుడు ప్రతి కార్మికుడు, హెల్మెట్, బూట్లు, కళ్లజోళ్లు ధరించాలని సూచించారు. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరి హద్దులకు వారు లోబడి పనులు చేయాలని, క్వారీలో దుమ్ము లేవకుండా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం నీళ్లు చల్లించాలని ఆదేశించారు. బ్లాస్టింగ్ చేసేటప్పుడు పంట పొలాల్లోని రైతులు, పక్క క్వారీలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. బ్లాస్టింగ్ సైరన్ మోగించాలని ఆయన తెలిపారు. ఆధునిక టెక్నాలజీ వాడకంతో పాటు కార్మికులకు ఆరు నెలలకొకసారి ఒకేషనల్ శిక్షణ, వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు.



క్వారీ మేనేజర్లతో మాట్లాడుతున్న సుప్రియో చక్రబర్తి

## అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి మృతి

**కొల్లూరు :** గ్యాస్ సిలెండర్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం కొల్లూరులో చోటుచేసుకుంది. తలశిల కృష్ణకుమారి (60) అద్దె ఇంటిలో నివసిస్తోంది. గురువారం వంట చేసుకునేందుకు స్టవ్ వెలిగించేందుకు ప్రయత్నించగా గ్యాస్ సిలెండర్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. వాటిల్లో చిక్కుకున్న కృష్ణకుమారి పెద్దపెట్టున కేకలు పెట్టడం ప్రారంభించింది. గమనించిన స్థానికులు ఆమెపై గోనె సంచి కప్పి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే తీవ్ర గాయాల పాలైన ఆమెను 1 తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తెనాలి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో మృతి చెందింది.



కృష్ణకుమారి (ఫైల్ )

## క్లుప్తంగా

### డాక్టర్ జయమ్మకు ఐఎంఏ పురస్కారం



**చిలకలూరిపేట:** పట్టణానికి చెందిన సీనియర్ వైద్యురాలు, ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కమ్యూనిటీ సర్వీస్ అవార్డు లభించింది. ఢిల్లీలోని ఐఎంఏ భవన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ నాయకులు బుధవారం ఆమెకు అక్కడ జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. 1971వ సంవత్సరంలో చిలకలూరిపేటలో వైద్య వృత్తిని ప్రారంభించిన జయమ్మ గత 53 సంవత్సరాలుగా వైద్యవృత్తిలో కొనసాగుతున్నారు. 1989 నుంచి ఐదేళ్ల పాటు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ఒక పర్యాయం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చిలకలూరిపేట శాఖ అధ్యక్షురాలిగా సేవలందించారు.

### హాస్టల్ మెస్ చార్జీలు విడుదల చేయాలి



మంత్రి నారాయణకు వినతి అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి సాయికుమార్

**పిడుగురాళ్ల:** ఆరు నెలలుగా హాస్టళ్లకు మెస్‌చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో అవి అప్పుల సంక్షోభంలో ఉన్నాయని తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర మంత్రి నారాయణకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ మాట్లాడుతూ కాస్మొటిక్ చార్జీలు కూడా 5 నెలలు నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హాస్టళ్లకు ట్యూషన్‌లు లేనికారణంగా 10వ తరగతి విద్యార్థులు సైతం రాత్రిళ్లు బయటికి వెళ్లాల్సి వస్తోందని విన్నవించారు. హాస్టళ్లల్లో శాశ్వత ట్యూటర్లను ఏర్పాటు చేయాలని సాయికుమార్ కోరారు. జీఓ నెంబర్ 77ని రద్దుచేసి పీజీ చదువుకునే విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెనను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అధిక జనాభాతో అనర్థాలే అధికం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

**బాపట్ల:** జనాభా అదుపునకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి కోరారు. స్థానిక ప్రాంతీయ వైద్యశాల వద్ద గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఆయన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజుతో కలసి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా పెరుగుదలలో భారత దేశం అగ్రభాగాన నిలిచిందన్నారు. మన దేశ జనాభా 138 కోట్లకు చేరినా అందుకు సరిపడా వనరులు దేశంలో పెరగలేదని తెలిపారు. యువశక్తి అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో భారత్ మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జనాభా పెరుగుదలతో సహజ వనరులపై ఒత్తిడి పడుతుందని చెప్పారు. ఈ క్రమంలో ఉద్యోగాలు, ఆహార ధాన్యాలు ప్రజలకు సమృద్ధిగా లేక ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉండాలంటే ఒకరు ఇద్దరు పిల్లలతోనే సాధ్యమని సూచించారు. జనాభా పెరుగుదల నియంత్రణకు ప్రజలంతా సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. భూమిని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్

#### ఆక్వా పార్కు ఏర్పాటుతో అన్ని రంగాల్లో అభివృద్ధి

ఆక్వా పార్కు ఏర్పాటుతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మత్స్య శాఖ అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వా పార్కు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులిస్తూ నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. వీటితో భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సముద్ర తీరం వెంబడి 192 ఎకరాలలో ఆక్వా పార్కు నిర్మించనున్నట్లు చెప్పారు. సముద్రం నుంచి ఏర్పడిన భూభాగంలో మత్స్య సంపద యోజన కింద ఆక్వా పార్కు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. ఆక్వా పార్కు ప్రాజెక్ట్‌తో ఐదు రకాల సెక్టార్లు నిజాంపట్నం ప్రాంతంలో అభివృద్ధిలోకి రానున్నాయని జిల్లా కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, మత్స్య శాఖ ఏడీ పి.సురేష్, ఆర్డీవో హేలా షారోన్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

#### మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంపై సంబంధిత విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ అధికారులతో గురువారం క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ ఎం. వెంకట సుధాకర్ బాబు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# వెదుళ్లపల్లిలో వివాహిత ఆత్మహత్య

- ఈనెల 5న ఎలుకల మందు తిన్న మృతురాలు శోభారాణి
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి
- ఎస్‌ఐ అజిత కారణమని మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఎస్‌ఐపై చర్యలు చేపట్టాలని జాతీయ రహదారిపై ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మృతురాలి బంధువులు



మృతురాలు శోభారాణితో భర్త వెంకట్రావు (ఫైల్)

**బాపట్ల టౌన్:** ఎలుకల మందు తిని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వెదుళ్లపల్లి కొత్తపాలెం పంచాయతీ, వడ్డెర కాలనీకి చెందిన బత్తుల శోభారాణి(30)కి కారంచేడు మండలం, కుంకలమర్రు గ్రామానికి చెందిన బత్తుల వెంకట్రావుతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. కుటుంబ అవసరాల నిమిత్తం నాలుగేళ్ల కిందట వెదుళ్లపల్లి గ్రామస్తుల వద్ద ఇద్దరూ రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. మనస్పర్థలు రావడంతో రెండేళ్ల కిందట విడిపోయారు. అప్పటినుంచి శోభారాణి వెదుళ్లపల్లిలోని పుట్టింట్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో గతంలో అప్పులు ఇచ్చిన గ్రామస్తులు వాటిని తీర్చాలంటూ శోభారాణిపై ఒత్తిడి పెంచారు. ఈ విషయం భర్త వెంకట్రావుకు పలుమార్లు చెప్పినప్పటికీ అతను పట్టించుకోలేదు. ఇటీవల తన ఆటోలో వెదుళ్లపల్లి సమీపంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న శోభారాణి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఆటో తీసుకొచ్చి వడ్డెర కాలనీలో పెట్టారు. అప్పులు తీర్చి తీసుకెళ్లాలని కాలనీ పెద్దలు పట్టుబట్టారు. తాను స్నేహితుడి ఆటో తీసుకు వస్తే బెదిరించి తీసుకున్నారంటూ వెంకట్రావు వెదుళ్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆటోను అతడికి అప్పగించారు. శోభారాణి ఈ నెల 5న వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆటోను అప్పగిస్తే..ఊళ్లో అప్పులు నేను ఎలా తీర్చాలి ? తన భర్తను పిలిపించి తీర్చేలా చూడండని ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించడంతో మనస్తాపంతో శోభారాణి స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎలుకల మందు తింది. స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి శోభారాణి మృతి చెందింది.

#### ఎస్‌ఐపై చర్యలు చేపట్టాలని ఆందోళన

అప్పులబాధ భరించలేక న్యాయం చేయమని ఎస్‌ఐ అజిత వద్దకు వెళితే దురుసుగా మాట్లాడటం కారణంగానే శోభారాణి మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు గురువారం వెదుళ్లపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ అజిత ఇక్కడకు వచ్చి జరిగిన వాస్తవం ఒప్పుకునేంతవరకు వెళ్లేది లేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీహరి, సర్కిల్ సీఐ హజరత్‌బాబు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శోభారాణి మృతిపై విచారణ జరిపి కారణమైన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం శోభారాణి అంత్యక్రియలు నిర్వహించారు.

# నష్టపోయిన మిర్చి రైతులకు పరిహారం ఇవ్వాలి



నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం ప్రతినిధులు

**క్రోసూరు:** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆమంచి విజ్ఞాన కేంద్రంలో మిర్చి బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో అచ్చంపేట మండలం తాళ్లచెరువులో 100 మంది రైతులు 250 ఎకరాల వరకు యూఎస్ 450 రకం మిర్చి పంట వేసి నష్టపోయారని తెలిపారు. పంట మొదటి దశలోనే పూత, పిందె సరిగా రాకపోవడంతో కంపెనీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ రైతులకు ప్రయోజనం కలగలేదని చెప్పారు. వెంటనే సమస్యను పరిశీలించి బాధిత రైతులకు ఎకరానికి రూ.లక్ష పంట నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో కంపెనీవారు పరిశీలించి జనవరి నెల నుంచి పంట వస్తుందని చెప్పటంతో రైతులు వేచి చూశారన్నారు. మార్చి నెల వరకు కూడా రాకపోవడంతో రైతులలో ఆందోళన మొదలై స్థానిక ఉద్యానశాఖ అధికారి, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కంపెనీ వారు పంటలను పరిశీలించి బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారని చెప్పి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఇంత వరకు చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు జోక్యం చేసుకుని కంపెనీ ద్వారా వెంటనే సమస్య పరిష్కారం చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని గోపాలరావు హెచ్చరించారు. అచ్చంపేట రైతు సంఘం మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా రైతు సంఘం కమిటీ సభ్యుడు ఆవులు ఆంజనేయులు, కొలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు కత్తుల గోపికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### త్రోబాల్ పోటీలు ప్రారంభం



**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర స్థాయి సీబీఎస్‌ఈ పాఠశాలల త్రోబాల్ పోటీలను గురువారం ఫాదర్ డాక్టర్ చిన్నా బత్తిని భాగ్యయ్య ప్రారంభించారు. అండర్–14, 17, 19 బాలికల విభాగాలకు స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి ఫాదర్ భరత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనుపమ, రమాదేవి, సావేరి, సంధ్య, చీఫ్ కోచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థిని మెడలో గొలుసుచోరీ

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని జరిగిన చైన్‌స్నాచింగ్ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. చైన్ స్నాచింగ్ విషయాన్ని బయటకి పొక్కకుండా తాడేపల్లి పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన నందిని కీర్తన కేఎల్‌యూలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ బయట హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 8న సోమవారం రాత్రి 10 గంటల సమయంలో భోజనం అనంతరం యూనివర్సిటీ సమీపంలోని వడ్డేశ్వరం–రేవేంద్రపాడు కరకట్టపై వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు మెడలో ఉన్న 10 గ్రాముల బంగారపు చైన్‌ను లాక్కుని పారిపోయాడు. ఘటనపై విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్‌ఐ ప్రతాప్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. గత నెల రోజుల్లో మంగళగిరి సబ్ డివిజన్‌లో నాలుగోసారి చైన్ స్నాచింగ్ జరిగింది. ఇప్పటికే ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు.

# టీడీపీ మండలాధ్యక్షుడిపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

- వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలపై ఆశ్రయించిన మహిళ
- ఫిర్యాదుపై రేపల్లె డీఎస్పీ విచారణ



ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన మహిళతో స్థానికులు

**కొల్లూరు :** వ్యక్తిగత కక్ష సాధింపుతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడిపై ఓ మహిళ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించడంతో విచారణ చేపట్టారు. గురువారం రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ బాధితురాలి ఫిర్యాదు మేరకు కొల్లూరులోని ఆమె గృహం వద్ద విచారణ నిర్వహించారు. బాధితురాలితో పాటు, స్థానికుల వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఫిర్యాదురాలు కథనం మేరకు..కొల్లూరు శివారు గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న చల్లంచర్ల కనకదుర్గ స్థానికంగా చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. వైఎస్సార్ సీపీకి మద్దతుదారురాలిగా ఉంటుందన్న అక్కసుతో కొన్నేళ్లుగా కొల్లూరు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో సైతం పోలింగ్ బూత్ సమీపంలో ఉన్న తన ఇంటికి వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి యత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిని మనసులో పెట్టుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ ఇటీవల బెదిరింపులను అధికం చేశాడు. ఈనెల 1న దుకాణం మూసి ఇంటికి వెళుతున్న సమయంలో సైతం నీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు దిగడంతో పాటు, దూషణకు పాల్పడ్డాడు. హోటల్ కూలగొట్టిస్తానని శపథాలు చేశాడు. రహదారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా హోటల్ నిర్వహించుకుంటున్న మహిళపై కక్షతో హోటల్ కూల్చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు ఫిర్యాదు చేసి నోటీసులు ఇప్పించాడు. తనపై వ్యక్తిగతంగా చేస్తున్న బెదిరింపులతో ఎస్టీ కమిషన్‌ను బాధితురాలు బుధవారం కలవడంతో జిల్లా కలెక్టర్, ఎస్పీలను విచారణ చేయాలని ఎస్టీ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రేపల్లె డీఎస్పీ కొల్లూరులోని ఆమె హోటల్ ప్రాంతాన్ని పరిశీలించి విచారణ జరిపారు. అనంతరం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదుదారుతో పాటు, స్థానికుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.




### వేప చెట్లు నరికి.. రూ. లక్ష స్వాహా చేసి..



అక్రమంగా తరలిస్తున్న వేప చెట్టు దుంగలు

**సత్తెనపల్లి:** అనుమతులకు విరుద్ధంగా 10 వేప చెట్లను నరికి రూ. లక్ష స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మేజర్‌లో గల ఎఫ్.మైనర్ రైలు కట్ట నుంచి అమరావతి మేజర్ వరకు గత 25 ఏళ్లుగా ఏడు వేపచెట్లు భారీగా పెరిగాయి. ఈ చెట్లను కొందరు వ్యక్తులు నరికి ముక్కలుగా తీసుకువెళ్లారు. స్థానిక రైతులు జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల సత్తెనపల్లి మండలం నందిగామ రోడ్‌లో గల పెట్రోల్ బంకు దిగువ భాగంలో ఉన్న మూడు వేప చెట్లను అక్రమంగా నరికి తీసుకెళ్లారు. మొత్తం ఈ పది వేప చెట్ల విలువ రూ. లక్షపైనే ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు. వీటి అక్రమ తరలింపులో జలవనరుల శాఖకు చెందిన ఓ అసిస్టెంట్ ఇంజినీర్ హస్తం ఉందనే ప్రచారం జరుగుతోంది. వేప చెట్లు నరికి వాటి కొమ్మలను అడ్డదిడ్డంగా పడ వేయడంతో ఆయా ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పర్యావరణానికి మేలు చేకూర్చే భారీ వేప చెట్లను నరికి , అక్రమంగా విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### రైళ్లలో పోగొట్టుకున్న 16 మంది సెల్‌ఫోన్లు అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్లను అందించిన జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు

**లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్):** రైళ్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 16 మందికి జీఆర్పీ పోలీసులు న్యాయం చేశారు. ఫోన్లను రికవరీ చేసి బుధవారం అప్పగించారు. గుంటూరు రైల్వే జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ఆధునిక సంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.3.40 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. రైళ్లలో అనుమానితులు తారసపడితే తక్షణమే 139, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు సూచించారు. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సైలు రమేష్, వెంకటాద్రి, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్స్ వలి, ఆర్‌పీఎఫ్, సీఐబీ సిబ్బంది పాల్గొన్నారు.

### బస్సు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తెనాలిరూరల్:** బస్సు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో రేపల్లె బస్సులు ఆగే ప్లాట్‌ఫాం వద్ద గురువారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బస్సు ఎక్కే క్రమంలో కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి ప్రయాణికులు 108కు సమాచారం అందించగా వాహనంలో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడిపైకి బస్సు ఎక్కడం కారణంగా మృతి చెందాడా లేదా అన్న అంశాన్ని పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్ తెలిపారు.

### 27న కత్తి పద్మారావు రచనలు ఆవిష్కరణ

**పొన్నూరు :** కవి డాక్టర్ కత్తి పద్మారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన రచించిన పలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు మాత రమాబాయి పురస్కార గ్రహీత కత్తి స్వర్ణ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గుంటూరు జిల్లా పొన్నూరులోని లుంబినీవనంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాసరి సేవలు, కట్ట సృజన, గుడిపూడి శాంతి, మదిర మరియ రాణి పాల్గొన్నారు.

### వెస్ట్ గోదావరిపై చిత్తూరు భారీ ఆధిక్యం

**మంగళగిరి:** అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న అండర్–16 మెన్ అంతర్ క్రికెట్ పోటీలలో గురువారం జరిగిన మ్యాచ్ –05లో వెస్ట్ గోదావరి జట్టుపై చిత్తూరు భారీ ఆధిక్యం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన చిత్తూరు జట్టు బ్యాట్స్‌మెన్స్ చెలరేగిపోవడంతో 80.1 ఓవర్లలో 331 పరుగుల భారీ స్కోర్ సాధించింది. బ్యాట్స్‌మెన్ షోహన్‌రెడ్డి ఒక సిక్స్, 14 ఫోర్లతో 119 బాల్స్‌లో 109 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ బి.నాగ జితిన్ 11 ఫోర్లలో 130 బాల్స్‌లో 90 పరుగులు సాధించాడు. వెస్ట్ గోదావరి బౌలర్లలో వివేక్ జైన్ 14 ఓవర్లలో 14 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా వెంకట నాగ మాధుర్ 18.1 ఓవర్లలో 75 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వెస్ట్‌గోదావరి 6.3 ఓవర్లలో 22 పరుగులకే ఆలౌటైంది. దీంతో తొలిరోజు చిత్తూరు జట్టు 309 పరుగులు ఆధిక్యం సాధించింది.

# ప్రజలకు అందుబాటులో ధాన్యం, పప్పుల ధరలు



బియ్యం, కందిపప్పు అందజేస్తున్న విజయబాబు

**వేమూరు:** ప్రజలకు అందుబాటులో ధాన్యం, పప్పుల ధరల్ని ప్రభుత్వం తీసుకు వస్తున్నట్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. మండల కేంద్రంలోని బాలాజీ రైస్ మిల్లు ఆవరణలో గురువారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ బియ్యం, కంది పప్పు తక్కువ ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాణ్యమైన కిలో కందిపప్పును రూ. 160, నాణ్యమైన స్టీమ్ బియ్యాన్ని రూ. 49, ఆర్ఎడబ్ల్యూ రకాన్ని రూ. 48కు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి ‘సినారె’



సమావేశంలో పాల్గొన్న సాహితీవేత్తలు

**అద్దంకి రూరల్:** మధురమైన సినీ గీతాలతో పాటు ఎన్నో కవితలు, సాహిత్య గ్రంథాల్నిరచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి సి.నారాయణరెడ్డి అని సాహితీవేత్త గాడేపల్లి దివాకరదత్తు కొనియాడారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురువారం స్థానిక దత్తసాయి క్లినిక్ ఆవరణలో సి.నారాయణరెడ్డి జీవితం, సాహిత్యంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకరదత్తు మాట్లాడుతూ ఎన్నో గ్రంథాలతోపాటు గొప్ప శైలిలో వందలాది సినీ పాటల్ని రచించి సినారేగా పేరు గడించారన్నారు. విశ్వంభర రచనకు జ్ఞానపీఠ్ అవార్డు రావడం తెలుగు వారందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం అద్దంకిలో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ప్రముఖ సాహితీ విశ్లేషకుడు ఆర్.వి. రాఘవరావును సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చందలూరి నారాయణరావు, డీవీఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేషతల్పశాయి, మిట్టా కామేశ్వరరావు, మిట్టా కామేశ్వర శర్మ, రామదాసు, బాలు, అంజయ్య, రఘురామ శర్మ, వీరయ్య పాల్గొన్నారు.

# రసవత్తరంగా కర్నూలు–కడప మ్యాచ్



బి.మహిత్, 5 వికెట్లు, కర్నూలు

**నరసరావుపేట ఈస్ట్:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర క్రికెట్ పోటీలలో కర్నూలు, కడప జిల్లాల మధ్య జరుగుతున్న మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కర్నూలు జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేయగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్ బుధవారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 4 వికెట్లు నష్టానికి 21 పరుగులతో రెండవరోజు గురువారం ఆట ప్రారంభించి 136 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జి.వి.సాయిసాకేత్ 52 పరుగులు చేయగా, కర్నూలు బౌలర్ బి.మహిత్‌కు ఐదు వికెట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగుల ఆధిక్యంలో ఉన్న కర్నూలు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి తన రెండవ ఇన్నింగ్స్‌లో ఎనిమిది వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. జట్టులోని పి.రోహిత్‌గౌడ్ 32 పరుగులు చేయగా, కడప బౌలర్ ఎ.శుభకాశ్యప్‌కు మూడు వికెట్లు లభించాయి. కర్నూలు జట్టుకు 179 పరుగుల ఆధిక్యత లభించగా ఇంకా రెండు వికెట్లు చేతిలో ఉన్నాయి. శుక్రవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.